క్లుప్తంగా

పుట్టిన ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

కొత్తపట్నం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో ప్రకారం పుట్టిన ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.వైష్ణవి సూచించారు. బుధవారం హాస్పిటల్లో విలేకర్ల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన తేదీ, కాన్పు అయిన హాస్పిటల్ వివరాలను ధ్రువీకరించే ఏకైక పత్రం జనన ధ్రువీకరణ పత్రమని అన్నారు. స్కూల్లో చేర్పించాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. బిడ్డ చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కావాలంటే కుల ధ్రువీకరణ పత్రం అవసరమన్నారు. ఇతర దేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్, వివాహం.. మొదలగు వాటన్నింటికి తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. పైన తెలిపిన ప్రతి దానికి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా అవసరమని, హాస్పిటల్లో కాన్పు చేయించుకుని జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకార్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

గమ్మళ్లపాలెం (కొత్తపట్నం): మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు సూచించారు. మండలంలోని గమ్మళ్లపాలెం గ్రామంలో ఓటర్లకు బుధవారం సాయంత్రం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చాలా ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుందని, ప్రజలంతా ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరూ ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఓటును అమ్ముకోకుండా సరైన నాయకుడినే ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ జగదీశ్, ఎస్సై బి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారామలక్ష్మణ విగ్రహాల పునఃప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, లంకపోతు అంజిరెడ్డి

మదనూరు (కొత్తపట్నం): మదనూరు పంచాయతీ కార్యాలయం వెనుకవైపు ఉన్న ఆలయంలో సీతారామలక్ష్మణ విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ నుంచి అంకురార్పణతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఆలయంపై కలశస్థాపన చేశారు. చివరిరోజు వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పాల్గొని సీతారామలక్ష్మణులను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో బాలినేని ప్రణీత్‌రెడ్డి, లంకపోతు అంజిరెడ్డి పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. హోమాలు, కళశాలకు సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా హోమాలు నిర్వహించారు. పది మంది పురోహితులతో మంత్రాలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, బద్దేల ప్రమోద్‌రెడ్డి, కన్వీనర్ కోటేశ్వరరావు, కొండయ్య, రవీంద్ర, ఏసురత్నం, బద్దేల హనుమారెడ్డి, బొమ్మిరెడ్డి మహేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, సత్యన్నారాయణరెడ్డి, పిన్న సత్యరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు సువర్ణ యజ్ఞోపవీతం నేత్రాల సమర్పణ

ఒంగోలు మెట్రో: ఫాల్గుణ మాసం బుధవారం శుక్ల ఏకాదశి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని కొప్పోలు చెన్నకేశవ స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం సమీర్‌కుమార్ ఆధ్వర్యంలో పురుష సూక్తంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్థానిక కొప్పోలు గ్రామస్తులై యూఎస్‌ఏలో ఉంటున్న పోతినేని సుబ్బారావు, రాజకుమారి, వారి కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మి అమ్మవారికి 350 గ్రాముల నూతన రజిత యజ్ఞోపవీతం మహా సంప్రోక్షణ, 8 గ్రాముల సువర్ణ నేత్రాలు ముక్కెర మహా సంప్రోక్షణను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.


రజిత యజ్ఞోపవీతం, సువర్ణ నేత్రాలకు పూజలు నిర్వహిస్తున్న సుబ్బారావు, రాజకుమారి


స్వామి, అమ్మవార్లకు సమర్పించిన రజిత యజ్ఞోపవీతం, సువర్ణ నేత్రాలు ముక్కెర

వారిని అర్చకుడు సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నోరు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం


ఓరల్ డే ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు టౌన్: నోరు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, లేకపోతే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని స్థానిక సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) దంతవైద్య విభాగం అధిపతి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డేని పురస్కరించుకుని బుధవారం నగరంలోని మంగమూరుడొంకలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిలో వేలాది బ్యాక్టీరియాలు ఉంటాయని, నోటిని తరచూ శుభ్రం చేసుకోకపోతే శరీరంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. పొగాకు ఎక్కువగా వాడటం వలన రక్తం చెడిపోతుందని, క్యాన్సర్, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ పొగ తాగడం అనే అలవాటు అనేక మందిలో ఇంకా కొనసాగుతుందని, పిల్లల ఎదుట పెద్దలు పొగతాగడం వలన వారికి తెలియకుండా పిల్లలు కూడా అలవాటు పడుతున్నారని అన్నారు. పొగతాగడం, పొగాకు నమలడం, గుట్కాల వలన క్యాన్సర్ సోకే ప్రమాదం హెచ్చుగా ఉంటుందన్నారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.భగీరథి మాట్లాడుతూ పిల్లలకు రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకునే అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్యశ్రీ, ప్రేమ, వినోద్, గీత, హిమబిందు, అభిజిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 300 మంది హాజరు

ఒంగోలు రూరల్: మండలంలోని త్రోవగుంట, కరవదిలో 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. త్రోవగుంటలో ముక్తినూతలపాడు, త్రోవగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 190 మంది పరీక్ష రాయగా, కరవదిలో గుండాయపాలెం, ఉలిచి, కరవది విద్యార్థులు 110 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ప్రారంభం కాగానే మార్కాపురం డిప్యూటీ డీఈవో 35 నిమిషాల పాటు కరవది పరీక్ష పరిశీలించారు. అనంతరం త్రోవగుంట, కరవది పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరిశీలించాయి.

కేజీబీవీలో దరఖాస్తులకు ఆహ్వానం

కొమరోలు: మండలంలోని రాజుపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొత్త అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కస్తూరిబా విద్యాలయం ప్రిన్సిపాల్ రోజ్ సులోచన తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు (ఎంపీసీ) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఏప్రిల్ 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉలవపాడు: అండర్‌పాస్ వద్ద రెండు వైపుల నుంచి వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు బైపాస్‌లోని కొల్లూరుపాడు అండర్ పాస్ వద్ద బుధవారం జరిగింది. అండర్‌పాస్ కింద ఉలవపాడు నుంచి బ్రిడ్జి కింద ఒకరు, సింగరాయకొండ వైపునకు ఒకరు రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలు కాగా ఒకరు రాజుపాలెం గ్రామానికి చెందిన వై మనోహర్ కాగా మరొకరి వివరాలు తెలియరాలేదు. గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉలవపాడు: మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. బద్దిపూడి గ్రామం సమీపంలో ఉన్నమన్నేరులో ఇసుకను లోడ్ చేసి తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై బాజిరెడ్డి సిబ్బందితో వెళ్లి దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

జూదరులు అరెస్టు

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామ పొలాల్లో కోడి పందేల శిబిరంపై ఎస్సై నాగేశ్వరరావు తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, ఒక కోడి పుంజు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడు దూదేకుల ఖాశీంవలిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యే కంచి కామకోటి పీఠం లక్ష్యం

పొదిలి రూరల్: వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కంచి కామకోటి పీఠం ఉద్దేశమని ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి గ్రామ సమీపంలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విద్యాలయంలో సీబీఎస్‌ఈ బిల్డింగ్ గృహ ప్రవేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఓబులక్కపల్లిలో దాదాపు రూ.30 కోట్లతో పాఠశాల పనులు శరవేగంగా సాగుతున్నాయని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

దాహం తీర్చడం అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

- డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

కురిచేడు: ఎండలు మండుతున్న తరుణంలో వివిధ పనులపై మండల కేంద్రాలకు వస్తున్న ప్రజల దాహార్తి తీర్చాలని సంకల్పించడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నుసుం సుబ్బారెడ్డి మనుమడు సాయి మనికంఠ పుట్టిన రోజు సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వినుకొండ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ వద్ద శివపార్వతి ఆటో ఫైనాన్స్ అధినేత దర్గారెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డిల చేతుల మీదుగా చలివేంద్రాలను ప్రారంభించారు. ఎండలు తగ్గేంత వరకూ చలివేంద్రాలు కొనసాగిస్తామని నిర్వాహకుల పేర్కొన్నారు. ఎంపీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఎంపీటీసీలు బుల్లం వెంకట నరసయ్య, కానాల శివారెడ్డి, కురిచేడు, కల్లూరు సర్పంచ్‌లు కేసన పల్లి కృష్ణయ్య, నక్కా రామకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కె.నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతిరెడి నాగిరెడ్డి, నాయకులు ఊట్ల వెంకటేశ్వర్లు, మేరువ పిచ్చిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, కాశీం షరీఫ్, మహ్మద్ జానీ, మౌలాలీ, కృష్ణ, నరసింహ, జక్రయ్య, నాసరయ్య, రమణయ్య, నారు శ్రీనివాసరెడ్డి, ఇందూరి సుబ్బారెడ్డి, రమణారెడ్డి, బి.గోవిందు, పి.గురునాథం, ఎం.యోగిరెడ్డి, సిద్ధి వెంకటరెడ్డి, మోషే, ముమ్మా శ్రీనివాసరావు, పోకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ లబ్ధి


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన కృష్ణ, ఇతర నాయకులు

- ప్రజలకు మేలు చేశాం.. మరోమారు దీవించండి
- వైఎస్సార్ సీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా విజ్ఞప్తి

మార్కాపురం: రాష్ట్రంలో అర్హులందరికీ గడిచిన 58 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోమారు ఓటు వేసి దీవించాలని ఆ పార్టీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు కోరారు. బుధవారం ఉదయం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అన్నా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల అభిమానం చూస్తుంటే వైఎస్ జగన్ మరోమారు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ నేతలు గుంటక వెంకటరెడ్డి, డాక్టర్ కనకదుర్గ, షెక్షావలి, కరీముల్లా, పానుగంటి మురళీ, చెంచిరెడ్డి, సుంకన్న, బుశ్శెట్టి నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావళి, పత్తి కృష్ణ, రఘుపతి శివ, నజీర్ అహ్మద్, సిరాజ్, దొడ్డ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి వైఎస్సార్ సీపీ నాయకులు


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఓబుల్‌రెడ్డిపల్లె నాయకులు

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధి ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రెండు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ నాయకులు బలవంతంగా వీరిని టీడీపీలో చేర్పిస్తే బుధవారం ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి ముఖ్య నాయకుల కలిసేందుకు వచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన సూర లక్ష్మీరెడ్డి, పందేనబోయిన తిరుమలయ్య, గంగుల చిన్నరాజు, పందేనబోయిన రంగనాయకులు, పి.గోపాలకృష్ణ, ఎగ్గాని శివప్రసాద్, పందేనబోయిన శాయన్న, పెరుగు పెద్ద పులయ్య, పెద్దబాల రంగయ్య, పెద్దరాజు, పెద్దపుల్లయ్య, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి పార్టీ కండువాలను వేసుకుని వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీలో చేరిన ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, సర్పంచి లతీఫ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు సూర స్వామిరంగారెడ్డి, సూర పాండురంగారెడ్డి, ఆకవీడు, చోళ్లవీడు మాజీ సర్పంచ్‌లు సూర పాండురంగారెడ్డి, ముత్యాల మధుసూదన్‌రావు, నాయకులు బద్దెటి ప్రవీణ్‌కుమార్, చిట్టెం మార్క్ పాల్గొన్నారు.

పేస్ కళాశాలలో బీఎల్ఐ ఎస్ఐలో శిక్షణ



శిక్షణ ఇస్తున్న నిపుణుడు లక్ష్మీనరసింహ

ఒంగోలు సెంట్రల్: స్థానిక పేస్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఐ ఎస్ఐ)లో బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రత్యేక నిపుణుడు పి.లక్ష్మీనరసింహ మాట్లాడుతూ వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్‌లో మిలియన్ల కొద్దీ ట్రాన్సిస్టర్ ఒక చిప్‌లో చేర్చడం ద్వారా ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్(ఐసీ)లు చేయబడతాయని చెప్పారు. ఈ టెక్నాలజీ నేర్చుకున్న విద్యార్థులకు సెమీ కండక్టర్ ఇండస్ట్రీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఈసీఈ హెడ్, డీన్ డాక్టర్ ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.